క్లుప్తంగా

ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓగా సాయికిశోర్

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓగా డాక్టర్ సాయికిశోర్ వ్యవహరిస్తారని ఆస్పత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ మమతారాణి శుక్రవారం తెలిపారు. ఆయన ఇదే ఆస్పత్రిలో అనస్తీషియా విభాగంలో ఆయన పనిచేస్తున్నారు. ఇంతకుముందు పని చేస్తున్న ఆర్‌ఎంఓ డాక్టర్ శారద ఇటీవల ఉద్యోగ విరమణ చెందడం విదితమే. ఈ నేపథ్యంలో సాయి కిశోర్ ఆర్‌ఎంఓగా వ్యవహరిస్తారు.

గాయపడిన విద్యార్థులకు ఆర్థిక సాయం


గాయపడిన విద్యార్థుల కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న అధ్యాపకులు

కుప్పం రూరల్: ఇటీవల గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతున్న కుప్పం ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థులు లోకేష్, చందుకు అధ్యాపకులు, విద్యార్థులు, యాజమాన్యం విరాళాలు సేకరించి ఆర్థిక సాయం చేశారు. కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు, వైస్ చైర్మన్ సునీల్‌రాజ్ శుక్రవారం లోకేష్‌కు రూ.1,00,150లు, చందుకు రూ.70,105 ఇచ్చారు. బీసీ నాగరాజు మాట్లాడుతూ విద్యార్థులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, అధ్యాపకులు భాస్కరన్, జయరామయ్య, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన కురబ నేతలు


కేంద్ర సహాయ మంత్రికి వినతిపత్రం ఇస్తున్న కురబ నేతలు

పలమనేరు: కేంద్ర పాడి పరిశ్రమ శాఖ సహాయ మంత్రి ఎస్పీ సింఘ్ బఘేల్‌ను ఉమ్మడి జిల్లా కురబ సంఘ నాయకులు ఢిల్లీలో శుక్రవారం కలిసి రాష్ట్రంలో గొర్రెల పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేసినట్టు రాష్ట్ర కురబ సంఘ నాయకులు జబ్బల శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం

- జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు


పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డిని అభినందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

పలమనేరు: నియోజకవర్గంలో వచ్చే స్థానిక సంస్థలు, ఆపై శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పట్టణ కన్వీనర్ హేమంత్ కుమార్‌రెడ్డికి సూచించారు. పట్టణ కన్వీనర్‌గా ఆయన ఎంపిక కావడంపై శుక్రవారం ఆయన్ను కలిసి అభినందించి మాట్లాడారు. గతంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావానికి ముందు నుంచే పార్టీకోసం కష్టపడిన వ్యక్తిగా హేమంత్‌కు పేరుందన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లో ఎండగడుతూ, పార్టీని అందరి సమన్వయంతో కలసి మరింత ముందుకు తీసుకెళ్లాలని మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు రెడ్డి, స్థానిక వైఎస్సార్ సీపీ నేత కొండారెడ్డి పాల్గొన్నారు.

నిందితుడు మా పార్టీకి చెందిన వ్యక్తి కాదు

కుప్పం రూరల్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తి తమ పార్టీకి చెందిన వాడు కాదని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ తెలిపారు. టీడీపీ కార్యకర్త లైంగిక దాడికి పాల్పడినట్లు కొన్ని పత్రికల్లో శుక్రవారం వార్తలు ప్రచురితమైనట్లు తెలిపారు. నిందితుడికి తమ పార్టీతో సంబంధం లేదని, తామే అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

9న మండల సమావేశం

పలమనేరు: పలమనేరు మండల సర్వసభ్య సమావేశం ఈనెల 9న మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రోజా అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఖాదర్‌బాషా శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వేడుకగా పంగుణి బ్రహ్మోత్సవాలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో పంగుణి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. ఉదయం స్వామికి అభిషేక పూజలు చేసి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు.

భౌబోయ్..!

చౌడేపల్లె మండలంలో వీధి కుక్కల బెడద పెరిగిపోయిందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తరచూ ఏదో ఒక చోట కుక్కకాట్లకు గురై లబోదిబోమంటూ ఆస్పత్రికి పరుగులు తీస్తున్నారు. వీటిని కట్టడి చేయండి మహాప్రభో అని గగ్గోలు పెడుతున్నారు.

- పెరిగిన కుక్కల బెడద
- మనుమలపై దాడి చేస్తున్న శునకాల గుంపు


చౌడేపల్లెలో వీధి కుక్కల గుంపు

చౌడేపల్లె: మండలకేంద్రంతో సహా పలు గ్రామాల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు, ద్విచక్ర వాహనాల్లో వెళ్తున్న వారు హడలిపోతున్నారు. కాస్త ఆద మరచినా ప్రజలపై వీధి కుక్కలు దాడిచేసి గాయపరుస్తున్నాయి. బస్టాండు సమీపంలోని చికెన్ షాపుల వద్ద వ్యర్థాల కోసం కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. ఆ వ్యర్థాలను ఆరగించడంతోపాటు అటువైపు వెళ్తున్న ప్రజలపై దాడులు చేయడం పరిపాటిగా మారింది. మరోవైపు మోటార్ సైక్లిస్టులకు సైతం ఇవి ఆసపత్రుల పాల్జేస్తున్నాయి. ద్విచక్రవాహనాలు వెళ్లేటప్పుడు రోడ్డుకు అడ్డంగా ఇవి పరుగులు తీస్తుండడంతో అదుపు తప్పి తీవ్రంగా గాయపడిన మోటార్ సైక్లిస్టులు ఎందరో ఉన్నారు. బోయకొండలో ఇటీవల కర్ణాటకు చెందిన భక్తులపై కుక్కలు దాడిచేశాయి. అలాగే చౌడేపల్లె, పెద్దకొండామర్రి, చిన్నకొండామర్రి, చౌడేపల్లె, దిగువపల్లె, పక్షిరాజపురం, చారాల తదితర ప్రాంతాల్లో కుక్కకాటున బారినపడిన వారూ ఉన్నారు. ప్రతినెలా 15నుంచి 25 వరకు కుక్కకాటు కేసులు నమోదవుతున్నాయి. మూడునెలల వ్యవధిలో 82 కేసులు పీహెచ్‌సీలో నమోదడం చూస్తే కుక్కల బెడద ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఇలా నిత్యం ఏదో ఒక గ్రామంలో కుక్కల దాడిలో చిన్నారుల నుంచి పెద్దల వరకే కాకుండా పశువులు సైతం గాయపడిన ఉదంతాలు ఉన్నాయి.

అధికారులు స్పందించాలి

కుక్కల స్వైర విహారానికి అడ్డుకట్ట వేసే దిశగా పంచాయతీ అధికారులు, పాలకులు స్పందించాలి. తరచూ కుక్కల దాడిలో ప్రజలు గాయాల పాలవుతున్నారు. కుక్కల దాడిలో ప్రజలే కాదు జంతువులకు ఇబ్బందులు తప్పడంలేదు. ఇండ్ల వద్ద పెంచుకునే కోళ్లు, గొర్రెలు, మేకలపై దాడిచేసి చంపి తినేస్తున్నాయి. అధికారులు ఇకనైనా దీనిపై దృష్టి సారించాలి.

–హేమంత్‌కుమార్, పెద్దూరు, చౌడేపల్లె మండలం

కుక్క కరిస్తే ఏఆర్‌వీ తప్పనిసరి

కుక్క కరిచిన వెంటనే కాటు పడిన ప్రదేశాన్ని సబ్బుతో శుభ్రపరుచుకోవాలి. ప్రభుత్వాసుపత్రిలో ఏఆర్‌వి(యాంటీ రేబీస్ వ్యాక్సిన్)ను ఐదురోజులపాటు వేయించుకోవాలి. వైద్యుల పర్యవేక్షణలో ఉంటూ చికిత్స పొందాలి. ప్రభుత్వాసుపత్రిలో కుక్కకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉంది.

–పవన్‌కుమార్, వైద్యాధికారి, చౌడేపల్లె

నోటీస్ బోర్డు

నేడు విద్యుత్ అంతరాయం

కుప్పం రూరల్: గుత్తార్లపల్లె వద్ద ఉన్న కుప్పం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా కుప్పం మున్సిపాలిటీ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు రెస్కో ప్రాజెక్టు ఇంజినీర్ సీఎం ప్రభాకర్ తెలిపారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: పట్టణంలోని ప్యాలెస్ ఆవరణలోని శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శనివారం నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం దీనికి సంబంధించి ఏర్పాట్లు చేశారు.15న రుద్రాభిషేకం పెద్ద ఎత్తున చేయనున్నట్టు పేర్కొన్నారు.

రేపటి నుంచి కోదండ రామాలయంలో..

పెద్దపంజాణి: మండలంలో ప్రసిద్ధిగాంచిన రాయలపేట శ్రీకోదండ రామాలయంలో ఆదివారం నుంచి 16వ తేది బుధవారం వరకు శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వంశపారంపర్య ధర్మకర్తలు సూదంశెట్టి వంశీకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం సీతారామలక్షణ సమేత ఆంజనేయ స్వామికి అభిషేకాలు, రాత్రి ఉత్సవ మూర్తుల ఊరేగింపు, 15వ తేది పుష్పపల్లకి, 11వ రోజు శయనోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలియజేశారు. రోజూ అన్నదానం చేయడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

6న ఉచిత ఆయుర్వేద శిబిరం

పలమనేరు: పట్టణంలోని సీఎస్‌ఏ ట్రస్ట్ స్థానిక కిండర్ కేర్ స్కూల్‌లో అంగవైకల్యం, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న 10 ఏళ్లలోపు పిల్లలకు 6వ తేదీ ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మదర్స్ గ్రేస్ ఆస్పత్రి వైద్యులు పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తారని, అవసరమున్న తల్లిదండ్రులు తమ పిల్లలకు శిబిరానికి తీసుకురావాలని కోరారు.

7న పలమనేరులో కలెక్టర్ గ్రీవెన్స్‌డే

పలమనేరు: ఈనెల 7న పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ నిర్వహిస్తారని, పలమనేరు రెవెన్యూ డివిజన్ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి నివేదించి పరిష్కరించుకోవాలని ఆర్డీఓ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు.

సబ్సిడీపై రైతులకు వ్యవసాయ పనిముట్లు

పలమనేరు: మండలంలోని రైతులకు 50 శాతం సబ్సిడీతో అవసరమైన వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్టు మండల వ్యవసాయాధికారిణి సంధ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రూ.9లక్షల బడ్జెట్‌తో ఎస్సీ రైతులకు 17శాతం, ఎస్టీలకు 8 శాతం, మిగిలింది బీసీ, ఓసీలకు కేటాయించినట్టు తెలిపారు. అయితే గత ఐదేళ్లలో ఎలాంటి పనిముట్లూ పొందనివారు, ఈ–క్రాప్ బుకింగ్ చేసిన రైతులు మాత్రమే అర్హులన్నారు. పూర్తి వివరాలకు రైతులు తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

గంగవరంలో..

గంగవరం: సబ్సిడీపై రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు ఇవ్వనున్నట్టు వ్యవసాయాధికారి హేమలత శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్ డ్రాన్ ఇంప్లిమెంట్స్ కింద రూ.6.64 లక్షల వరకూ సబ్సిడీ, స్ప్రేయర్స్‌కు రూ.1.58 లక్షల వరకూ సబ్సిడీ ఉందన్నారు. ట్రాక్టర్ పనిముట్లు అవసరమైన రైతులకు సొంతంగా భూమి కలిగి, 5 ఏళ్లలో ఇంతవరకూ పనిముట్లు పొందని వారికి మాత్రమే వీటిని సబ్సిడీపై పొందవచ్చన్నారు. ఈ–క్రాప్ బుకింగ్ సైతం చేసుకుని ఉండాలన్నారు. వ్యవసాయ పరికరాలు 9 మడకలు, 5 మడకలు, భూమి చదును చేసే బ్లేడ్లు, స్ప్రేయర్లు ఉన్నాయని, అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: ఎస్‌ఎంఏఎం పథకం కింద సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు, పరికరాలు ఇవ్వనున్నట్లు ఏఓ రఖీబా శుక్రవారం తెలిపారు. ట్రాక్టర్లకు అవసరమైన లెవలింగ్ బ్లేడు, 5, 9 మడకల సెట్లు, పవర్ స్ప్రేయర్లు ఉన్నాయని, ఆసక్తి కలిగిన రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఆమె కోరారు.

అనుమతి లేని ఫ్లెక్సీలు తొలగింపు


పారిశుద్ధ్యం మెరుగు పరుస్తున్న కమిషనర్ మధుసూదన్‌రెడ్డి


పుంగనూరులో ఫెక్సీలను తొలగిస్తున్న దృశ్యం

పుంగనూరు: పట్టణంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా అన్ని రకాల ఫ్లెక్సీలను తొలగించినట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాలలో వేకువజాము నుంచి పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. మురుగునీటి నిల్వలను తొలగించారు. కాలువల్లో పూడిక తీసి ట్రాక్టర్లలో తరలించారు. అలాగే పట్టణంలోని దుకాణాల ముందు ఏర్పాటు చేసిన సైన్ బోర్డులు, రోడ్డుపై ఉన్న తోపుడుబండ్లు, రోడ్డుకు ఇరువైపులా కట్టిన ఫ్లెక్సీలను సైతం తొలగించి వాటిని ట్రాక్టర్లలో మున్సిపాలిటీకి తరలించారు. కమిషనర్ మాట్లాడుతూ, మున్సిపాలిటీ అనుమతి లేకుండా ఆదాయానికి గండికొడుతూ ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులు, ఫ్లెక్సీలను తొలగించామన్నారు. ట్రాఫిక్ సమస్యలపై దృష్టి సారించి స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు ఈ కార్యక్రమానికి పూనుకున్నట్టు చెప్పారు. పట్టణంలో ఎవరైనా అనుమతి లేకుండా ఫెక్సీలు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేస్తే జరిమానాలు విధించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అంబేడ్కర్ విగ్రహ స్థలం మార్పు


విగ్రహం ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న సీఐ

సదుం: మండలంలోని కలకటవారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు అధికారుల చొరవతో స్థలం మార్పు చేశారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తున్న స్థలంపై కొంత కాలంగా గ్రామంలో వివాదం నెలకొంది. ఆలయం ముందు, ప్రధాన రోడ్డు మలుపులో విగ్రహం ఉండడంతో అసౌకర్యంగా ఉందని పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అందరి సమన్వయంతో విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ నేపథ్యంలో విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న ఎర్రయ్య, శ్రీరాములతో చర్చించి స్థలం మార్పుకు అంగీకరించేలా చేసినట్లు తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్, ఎస్‌ఐ షేక్‌షా వలి తెలిపారు. మార్పు చేసిన స్థలంలో విగ్రహ ఏర్పాటు పనులను సీఐ రాంభూపాల్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పర్యవేక్షించారు.

టీడీపీ పాలనలో అంబేడ్కర్‌కు ఇచ్చే గౌరవమిదేనా?

కలకటవారిపల్లెలో అంబేడ్కర్ విగ్రహాన్ని యథాస్థానంలో ఉంచాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమలా సుదర్శన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విగ్రహాన్ని అధికారులు దగ్గరుండి తొలగించడాన్ని ఖండిస్తున్నామని, వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ పాలనలో అంబేడ్కర్‌కు ఇచ్చే గౌరవం ఇదేనా? అని ప్రశ్నించారు. విగ్రహాన్ని యథాస్థానంలో ఏర్పాటు చేయనిపక్షంలో సోమవారం నుంచి మాల మహానాడు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

బోర్లు వేసి తాగునీటి సమస్యలు పరిష్కరిస్తాం


బోరు డ్రిల్లింగ్‌కు పూజ చేస్తున్న ఎంపీపీ యువరాజ్

వి.కోట: ఉష్ణోగ్రతలు పెరుగుతున్న తరుణంలో మండలంలోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ పరిస్థితుల్లో అవసరమైన గ్రామాల్లో కొత్తగా బోర్లు వేయించి దాహార్తి సమస్యలు పరిష్కరిస్తామని ఎంపీపీ యువరాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ కుదవగడ్డ గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తోంది. గ్రామస్తుల వినతి మేరకు ఎంపీపీ మండల నిధులను మంజూరు చేయించి శుక్రవారం బోరు పనులకు భూమి పూజ చేసి డ్రిల్లింగ్ ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రామచంద్రప్ప, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆక్రమణల నుంచి ప్రభుత్వ భూమికి విముక్తి


ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ అధికారులు

–ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

రొంపిచెర్ల: ప్రభుత్వ భూమిని ఎవరూ ఆక్రమించరాదని, ఎవరైనా అలాంటి చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవంటూ రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. తహసీల్దార్ తెలిపిన వివరాలు..మండలంలోని జాండ్లవారిపల్లె గ్రామ పంచాయతీ దుస్సావాండ్లపల్లెకు సమీపంలోని సర్వే నంబర్ 2670–15 లో 1.09 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిని దుస్సావారిపల్లెకు చెందిన కమలాపురం యశోదమ్మ, ఆమె కుమారులు ఆక్రమించుకున్నారని రైతులు ఫిర్యాదు చేయడంతో తహసీల్దార్ సర్వే చేయించారు. అది ప్రభుత్వ భూమేనని తేలడంతో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైతే తమ దృష్టికి తేవాలని తహసీల్దార్ కోరారు. కార్యక్రమంలో పెద్దమల్లెల వీఆర్వో పల్లవి, సీనియర్ అసిస్టెంటు ముబారక్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పొడమలకు బయలుదేరిన ప్రభోదానంద భక్తులు



కుప్పం రూరల్: కుప్పంలోని ప్రభోదానంద సేవా సమితి సభ్యులు 200 మంది శుక్రవారం అనంతపురం జిల్లా పొడమలలో ఉన్న ప్రభోదానంద ఆశ్రమానికి బయలుదేరారు. ప్రభోదానంద స్వామీజీ జయంతి ఉత్సవాలను శనివారం నిర్వహించనున్నట్టు సేవా సమితి కుప్పం ప్రతినిధి కృష్ణ తెలిపారు. ఈ నేపథ్యంలో కుప్పం నుంచి వెళుతున్నట్టు పేర్కొన్నారు.

జగ్జీవన్‌రామ్ జయంతి

పుంగనూరు: పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు కవర్లు పంపిణీ

పుంగనూరు: నియోజకవర్గంలోని మామిడి రైతులు 568 మందికి మామిడి కవర్లు పంపిణీ చేసినట్లు ఉద్యానవనశాఖాధికారి సంతోషి కుమారి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ, ఒక్కో రైతుకు 8వేల కవర్ల చొప్పున 40 లక్షల కవర్లు పంపిణీ చేశామన్నారు. ఈ కవర్లను మామిడి కాయలకు కట్టి, పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు


ప్రత్యేక పూజలందుకొన్న అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి రాహుకాల సమయంలో అర్చనలు, అభిషేక పూజల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తీర్థప్రసాదాలను, ఉచిత అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ ఈఓ ఏకాంబరం పర్యవేక్షించారు.

పీహెచ్‌సీలో కాన్పులు ఎక్కువ చేయాలి

– డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి


ముదిబాపనపల్లె పీహెచ్‌సీలో డాక్టర్లతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణి

పుంగనూరు: పీహెచ్‌సీలో కాన్పులు ఎక్కువ చేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డీటీ సుధారాణి ఆదేశించారు. శుక్రవారం ఆమె మండలంలోని ముడిబాపనపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించిన అనంతరం వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఓపీ, ఐఎల్ఆర్, కోల్డ్ చైన్‌మెయింటెనెన్స్‌లను విధిగా నిర్వహించాలన్నారు. అన్ని రకాల పరీక్షలు ల్యాబ్‌లో చేయాలని, ప్రతిదీ రోగుల ఐడీలో నమోదు చేయాలని ఆదేశించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ, వడగాడ్పులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలందించడమే ప్రధాన విధిగా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రవీణ, నవీన్‌తేజ, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర ఉత్పత్తులు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ హేమలత

గంగవరం: ప్రకృతి వ్యవసాయం చేయడం ఉత్తమమని, తద్వారా ఆరోగ్యకర ఉత్పత్తులు సాధించవచ్చని వ్యవసాయాధికారి హేమలత అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం గంగవరం మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో రైతు సాధికార సంస్థ అవగాహన సదస్సు నిర్వహించింది. ముఖ్యఅతిథిగా ఏఓ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలి? శరీరానికి ఆరోగ్యాన్నిచ్చే పంటలు..పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలు..ఇత్యాది వాటిపై ఆమె అవగాహన కల్పించారు. వ్యవసాయానికి ఉపయోగించే కషాయాలు, గుళికలు ఎలా తయారు చేయాలో ప్రదర్శనపూర్వకంగా చూపించారు. సదస్సులో ఏపీఎం హరినాథ్, రైతు సాధికార సంస్థ జిల్లా ఎస్ఎఫ్ఏ ఫైజు, పుంగనూరు డివిజన్ యంటి రెడ్డికుమారి, ఎంఎంటీలు చంద్రశేఖర్, భారతి, పీఆర్‌పీఐ సీఆర్‌పీలు వెంకట్రామిరెడ్డి, దీప, లక్ష్మి, ప్రసన్న, సీసీలు, సంఘమిత్రలు, వీఓ లీడర్లు పాల్గొన్నారు.

సారా స్వాధీనం: దంపతులపై కేసు

చౌడేపల్లె: సారా స్వాధీనం చేసుకుని పోలీసులు భార్యాభర్తలపై కేసు నమోదు చేశారు. శుక్రవారం ఎస్‌ఐ నాగేశ్వరరావు తెలిపిన వివరాలు..మండలంలోని దుర్గసముద్రం పంచాయతీ కేతనపల్లెలో సారా విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. గ్రామానికి చెందిన దంపతులు నాగజ్యోతి, శివకుమార్ సారా విక్రయిస్తున్నట్టు గుర్తించారు. దాడుల్లో నాగజ్యోతి పట్టుబడింది. శివకుమార్ పరారయ్యాడు. 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా కుంభాభిషేక వేడుకలు

సదుం: మండలంలోని భట్టువారిపల్లెలో తిరుపతి గంగమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా శుక్రవారం మహా కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో యాగపూజ, స్వర్ణాహుతి, కళాహోమం, ప్రాణ ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, దాతలు రమణమ్మ, నారాయణస్వామి, సుభద్రమ్మ, వెంకటస్వామి, నాయకులు రామయ్య, కరెంటు నారాయణ, రమణ, రమేష్ పాల్గొన్నారు.


గంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు